సాక్షి
గుంటూరు

మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ : దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు సోమవారం రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 4808 క్యూసెక్కులు విడుదల చేశారు.



స్మృతివనం పనులు పరిశీలన

విజయవాడ : అంబేడ్కర్ స్మృతివనం పనులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు. పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు.


న్యూస్‌రీల్

నవంబర్ 4న జిల్లా సైన్స్ నాటిక పోటీలు

డీఈఓ శామ్యూల్

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా స్థాయి సైన్స్ నాటిక పోటీలను నవంబర్ 4వ తేదీ ఉదయం 9 గంటల నుంచి పల్నాడు రోడ్డులోని పల్నాడు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ సోమవారం తెలిపారు. మానవ సంక్షేమం కోసం శాస్త్ర సాంకేతిక విజ్ఞాన రంగాల ప్రాముఖ్యంపై నాటికలు ఉండాలని తెలిపారు. దీంతోపాటు చిరుధాన్యాలు-మంచి ఆహారం, ఆహార భద్రత, శాస్త్ర సాంకేతిక రంగాలలో నూతన ఆవిష్కరణలు, మూఢనమ్మకాలను పారదోలుట తదితర ఉప అంశాలతో నాటికలు ఉండాలని వివరించారు. 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు గరిష్టంగా 8 మంది నాటిక ప్రదర్శనలో పాల్గొనవచ్చని వెల్లడించారు. జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చిన బృందాన్ని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే పల్నాడు జిల్లా స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలను నవంబర్ 10వ తేదీన మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని డీఈఓ వెల్లడించారు. వివరాలకు జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ ఎ.ఎ.మధుకుమార్ 90328 71234 సంప్రదించాలని సూచించారు.

తాత్కాలికంగా పలు రైళ్లు రద్దు




లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలో జరుగుతున్న పనుల నేపథ్యంలో గుంటూరు డివిజన్ మీదుగా నడిచే పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రోణాచలం–గుంటూరు(17227), కాచిగూడ–గుంటూరు(17252) 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు. గుంటూరు–డ్రోణాచలం(17228), కాచిగూడ–నడికుడి(07791), నడికుడి–కాచిగూడ(07792), విజయవాడ–గుంటూరు (07464), గుంటూరు–విజయవాడ(07465), గుంటూరు– కాచిగూడ(17251), మెదక్–కాచిగూడ(07578), కాచిగూడ–మెదక్(07577), విజయవాడ–గుంటూరు(07783), గుంటూరు–మాచర్ల(07779), మాచర్ల–నడికుడి (07580), నడికుడి–మాచర్ల(07579), మాచర్ల–గుంటూరు(07780), గుంటూరు–విజయవాడ(07788) రైళ్లను నవంబర్ 6 నుంచి 12వ తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

బీఎల్‌ఓలకు షోకాజ్ నోటీసులు

పెదకాకాని: ఇంటింటికి తిరిగి ఓటర్ జాబితా సర్వే చేయడంలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు బీఎల్‌ఓలకు ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. గత ఆగస్టులో మండలంలో ప్రతి ఇంటికీ తిరిగి ఓటర్ జాబితాపై సర్వే నిర్వహించారు. తొలగించిన ఓట్లు, ద్వంద్వ ఓట్లు, డెత్ కేసులు, కొత్త ఓటర్ల నమోదుపై సర్వే జరిగింది. ముఖ్యంగా గత కాలానికి సంబంధించి తొలగించిన ఓట్లు, డెత్ కేసులు, షిఫ్టెడ్ ఓటర్ల పరిశీలన జరిగింది. అప్పట్లో నంబూరు గ్రామానికి చెందిన వీఆర్వో బినామీ వ్యక్తితో సర్వే చేయించడంతోపాటు వెనిగండ్లలో ఇరు పార్టీలకు చెందిన వ్యక్తులతో కలిసి ఒకచోట కూర్చుని సచివాలయ ఉద్యోగి సర్వే చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. మరికొందరు సర్వే చేయడంలోనే బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా విధులు నిర్వహించిన పెదకాకాని పంచాయతీ కార్యదర్శి ఎ.సాంబశివరావు, కొప్పురావూరు మహిళా పోలీసు ఎం.భవ్యశ్రీ, ఉప్పలపాడు బిల్ కలెక్టర్ జి.రాంబాబులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సూపరింటెండెంట్ బి.వి.మల్లేశ్వరరావు తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 525 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 27,783, ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 844.60 అడుగుల వద్ద ఉంది.

మేలు మలుపల్లె

- సమగ్రాభివృద్ధి దిశగా పల్లెలు
- ప్రతిపక్ష సర్పంచ్ ఉన్నా కోట్ల రూపాయల ఖర్చు
- సంక్షేమ కార్యక్రమాలకు రూ.11 కోట్లు
- అభివృద్ధి పనులకు రూ.కోటి 74 లక్షలు
- తెనాలి మండలం గుడివాడ గ్రామ అభివృద్ధి తీరిది

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వైఎస్సార్ సీపీ పాలన గ్రామ స్వరాజ్యానికి మేలు మలుపుగా మారుతోంది. కులం చూడం, మతం చూడం, ప్రాంతం చూడం, పార్టీ చూడం అన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పల్లెలు అభివృద్ధి దిశగా పరుగులు పెడుతున్నాయి. స్థానికంగా ప్రతిపక్ష మద్దతుదారులు అధికారంలో ఉన్నా.. సర్కారు ప్రగతి మంత్రంతో ముందుకు సాగుతోంది. గ్రామాల ముఖచిత్రాన్ని సమూలంగా మారుస్తోంది.

2019కి ముందు.. తర్వాత

గ్రామాల అభివృద్ధి 2019కి ముందు, ఆ తర్వాత అన్న విధంగా మారింది. అన్ని గ్రామాల రూపురేఖలు మారుతూ వస్తున్నాయి. ప్రతి గ్రామంలోనూ సచివాలయంతోపాటు వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, మనబడి నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధితో పాటు శ్మశాన వాటికల ఆధునికీకరణ, కొత్త సిమెంట్ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.



గుడివాడ గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం



గుడివాడ గ్రామ సచివాలయం

గుడివాడ.. అభివృద్ధి జాడ

తెనాలి నియోజకవర్గం గుడివాడ గ్రామంలో పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం సర్పంచ్ ఎన్నిక అయ్యారు. గ్రామ జనాభా 2,900. ఓటర్లు 2,200 మందికిపైగా ఉన్నారు. వరి, పసుపు, అరటి, కూరగాయలు ప్రధానంగా పండిస్తారు. 1,164 కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో ప్రస్తుతం 510 మందికి వివిధ రకాల పింఛన్లు వస్తున్నాయి. 1,031 రైస్ కార్డులు ఉన్నాయి. ఈ గ్రామం 2019 తర్వాత ప్రగతిబాట పట్టింది. ప్రభుత్వ ప్రాధాన్య భవనాలు నిర్మితమయ్యాయి. మౌలిక వసతులు సమకూరాయి. ఈ గ్రామంలోని లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటివరకు రూ.11.09 కోట్లు అందాయి.

సొంత ఇంటి కల నెరవేరింది.



పూరి ఇంట్లో ఉండే వాళ్లం. ఇళ్ల స్థలం లేదు. జగనన్న లేఅవుట్‌లో ఇంటి స్థలం ఇచ్చారు. రూ.1.80 లక్షలు రుణం మంజూరు చేశారు. కొద్దిగా అప్పు చేసి ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. సొంతింటి కల సాకారమైంది. వైఎస్సార్ కల్యాణమస్తు పథకం ద్వారా మా కోడలికి రూ.లక్ష వచ్చాయి. వైఎస్సార్ చేయూత వచ్చింది. డ్వాక్రా రుణమాఫీ అయ్యింది. చాలా ఆనందంగా ఉంది.

– మత్తే మార్తమ్మ, జగనన్న లేఅవుట్‌లో ఇంటి నిర్మాణదారు, గుడివాడ, తెనాలి మండలం

నిర్మాణంలో ఉన్నవి	కేటాయించిన నిధులు (రూ.ల్లో)
ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణం	10,00,000
ఎస్సీ కాలనీ సీసీ డ్రెయిన్ నిర్మాణం	6,00,000
మొత్తం	16,00,000

నాలుగేళ్లలో గుడివాడ ప్రగతిపథం ఇలా..

పూర్తయిన అభివృద్ధి పని	ఖర్చుచేసిన నిధులు(రూ.ల్లో)
గ్రామ సచివాలయం	40,00,000
రైతు భరోసా కేంద్రం	21,00,000
వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్	21,80,000
ఎంపీయూపీ స్కూల్‌లో నాడు–నేడు	19,50,000
అంతర్గత రోడ్లు	5,00,000
అంతర్గత డ్రెయిన్లు	15,00,000
జీజీఎంపీ డ్రెయిన్లు	7,04,000
జీజీఎంపీ రోడ్లు	1,40,000
జగనన్న లేఅవుట్లో రోడ్లు	5,50,000
హిందూ శ్మశాన వాటిక	17,00,000
హిందూశ్మశాన వాటికలో రోడ్డు	3,00,000
తిరుపతమ్మ ఆలయంలో పొంగలిషెడ్డు	8,50,000
యాదవపాలెంలో కమ్యూనిటీ హాలు	10,00,000
మొత్తం	1,74,74,000

జగనన్న మళ్లీ రావాలి



డ్వాక్రాలో స్త్రీనిధి రుణం ద్వారా రూ.2 లక్షలు మంజూరు చేశారు. ఆ నగదుతో గ్రామంలో ఫ్యాన్సీ షాపును పెట్టా. బతుకుబండి హాయిగా సాగుతోంది. బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేస్తే షాపును వృద్ధి చేసుకుంటా. జగనన్న మళ్లీ రావాలి. నాకు డ్వాక్రా రుణం మాఫీ అయింది. వైఎస్సార్ చేయూత వస్తోంది. జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల స్థలం వచ్చింది. ఇల్లు కట్టుకోబోతున్నాం.

– బురద గుంట సుకన్య, ఎస్ఎస్ ఫ్యాషన్ నిర్వాహకురాలు, డ్వాక్రా స్త్రీనిధి లబ్ధిదారు, గుడివాడ, తెనాలి మండలం



వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

రూ.కోటీ 74 లక్షలతో అభివృద్ధి



గుడివాడ ఎంపీటీసీ సభ్యునిగా గెలుపొందాను. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆశీస్సులతో గతంలో తెనాలి మండల పరిషత్ అధ్యక్షునిగా పనిచేశా. గుడివాడ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక అమలు చేశాం. రూ.కోటీ 74 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తిచేశాం. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌ను నిర్మించడం గర్వంగా ఉంది.

– చెన్నుబోయిన శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ, తెనాలి

సీఎంకు రుణపడి ఉంటాం



15 ఏళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. నయం కాలేదు. పింఛన్ కోసం గత తెలుగుదేశం ప్రభుత్వంలో దరఖాస్తు చేశా. రాలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పింఛన్ మంజూరు చేశారు. రూ.ఐదువేలు వస్తున్నాయి. మందులకు సరిపోతున్నాయి. మంచంలోనే ఉంటున్నా. సీఎం జగన్ బాబుకు జీవితాంతం రుణపడి ఉంటాం. నా భర్తకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది.

– బొద్దులూరి అంబోజమ్మ, పక్షవాత పింఛన్‌దారు, గుడివాడ, తెనాలి మండలం.

బతకాలని ఆశ కలిగించారు



1978లో మోటార్ సైకిల్‌పై నుంచి కిందపడ్డా. రెండు కాళ్లూ విరిగాయి. ఆపరేషన్ చేశారు. కర్రలతో నడుస్తున్నా. పెళ్లి చేసుకోలేదు. నాకంటూ ఎవరూ లేరు. జీవనానికి ఇబ్బందిగా ఉండడంతో చనిపోదామనుకున్న సమయంలో సీఎం జగన్ నాకు వ్యాధిగ్రస్తుల పింఛన్ ద్వారా రూ.ఐదువేలు మంజూరు చేశారు. బతుకుపై ఆశ కల్పించారు. జీవనం హాయిగా సాగుతోంది.

– బి.సుబ్బారావు, వ్యాధిగ్రస్తుల పింఛన్‌దారు, గుడివాడ, తెనాలి మండలం

ఆర్టీసీ దసరా ఆదాయం రూ.58 లక్షలు

- నవంబర్ 25 వరకు కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు
- కార్తీక మాసంలో ప్రత్యేక బస్సు సర్వీసులకు ప్రణాళిక
- జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్



పాత గుంటూరు: దసరా సందర్భంగా ఈనెల 13వ తేదీ నుంచి 29 వరకు జిల్లా నుంచి పలు ప్రాంతాలకు 173 ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపగా సుమారు రూ. 58 లక్షల అదనపు ఆదాయం లభించిందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.రవికాంత్ తెలిపారు. సోమవారం గుంటూరు బస్ స్టేషన్‌లోని డీపీటీఓ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్గో విభాగంలో పార్సిల్, కొరియర్ డోర్ డెలివరి ప్రచార మాసోత్సవాలు నవంబరు 25 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ డోర్ డెలివరీలో 50 కేజీల వరకు అతి తక్కువ ధరలో అత్యంత భద్రంగా, వేగంగా ప్రజల ఇంటి వద్దకే ఆర్టీసీ రవాణా చేయనుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. గుంటూరు నుంచి హైదరాబాద్‌కు గరుడ ఏసీ బస్సు చార్జి రూ.780 నుంచి రూ.700కు తగ్గించినట్లు వివరించారు. ఈ బస్సు గుంటూరు బస్ స్టేషన్ నుంచి రాత్రి 10 గంటలకు బయలుదేరి హైదరాబాద్ (బీహెచ్ఈఎల్)కు మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు చేరుతుందని చెప్పారు. గుంటూరు–అమరావతి మధ్య రెండు బస్ స్టేషన్ల నుంచి ప్రతి 15 నిమిషాలకు బస్సు సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. కార్తీక మాసంలో పంచారామాలకు, అరుణాచలం, అయ్యప్పస్వామి దర్శనార్థం శబరిమలైకు ప్రత్యేక బస్సులను నడిపేందుకు ప్రణాళికలు రూపొందించనున్నట్టు రవికాంత్ తెలిపారు.

ఫిజియోథెరపిస్టు హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ నచికేత్ షల్కి

గుంటూరు ఈస్ట్: ఇంట్లో ఒంటరిగా ఉన్న ఫిజియోథెరపిస్టు హత్యకు గురైన ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా బెల్లంకొండకు చెందిన సత్తెనపల్లి సీతారామాంజనేయులు (36) గుంటూరులోని ఓ ఆస్పత్రిలో ఫిజియోథెరపిస్టుగా పని చేస్తున్నాడు. సీతారామాంజనేయులు గతంలో తన సోదరి కుమార్తెను వివాహం చేసుకున్నాడు. అయితే భార్యను బెల్లంకొండలోనే వదిలేసి గుంటూరులోని గుంటూరువారితోట 5వ లైనులో నివాసం ఉంటున్నాడు. తాను పనిచేసే ఆస్పత్రిలోనే ఫార్మాసిస్టు అయిన స్వాతిరెడ్డిని రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే వీరి వివాహం స్వాతిరెడ్డి తల్లిదండ్రులకు ఇష్టం లేదు. స్వాతిరెడ్డి సంవత్సరన్నర క్రితం యూఎస్‌లో ఎం ఫార్మసీ చేసేందుకు వెళ్లింది. సీతారామాంజనేయులు ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. రోజూ విధులకు వెళ్లి వస్తుంటాడు. నవంబరు 1న స్వాతిరెడ్డి యూఎస్‌ఏ నుంచి గుంటూరు రానుంది. స్వాతిరెడ్డి తండ్రి పి.శ్రీనివాసరెడ్డి ఆర్టీసీ ఉద్యోగి. శ్రీనివాసరెడ్డి ఆదివారం రాత్రి సీతారామాంజనేయులు ఇంటికి వచ్చి మాట్లాడి వెళ్లినట్లు సమాచారం. సోమవారం ఉదయం సీతారామాంజనేయులు అసిస్టెంట్ వచ్చేటప్పటికి అతను విగతజీవుడై రక్తపు మడుగులో పడి ఉన్నాడు. దీంతో అసిస్టెంట్ వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీతారామాంజనేయులు తలకు బలమైన గాయమైంది. ఈస్ట్ అడిషనల్ ఎస్పీ నచికేత్ షల్కి, కొత్తపేట ఎస్‌హెచ్‌ఓ షేక్ అన్వర్‌బాషా ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

దుర్గమ్మ కానుకల ఆదాయం రూ. 2.58 కోట్లు



విజయవాడ: దసరా ఉత్సవాల నేపథ్యంలో దుర్గమ్మకు భవానీలు, భక్తులు హుండీల ద్వారా అమ్మవారికి సమర్పించిన కానుకలు, మొక్కుబడుల లెక్కింపు సోమవారం నుంచి ప్రారంభమైంది. తొలి రోజైన సోమవారం నిర్వహించిన లెక్కింపులో రూ. 2,58, 64,740 నగదుతో పాటు 367 గ్రాముల బంగారం 8.745 కిలోల వెండి లభించినట్లు ఆలయ ఈవో కె.ఎస్.రామారావు తెలిపారు. మహా మండపం ఆరో అంతస్తులో నిర్వహించిన కానుకల లెక్కింపులో దేవస్థానం, సేవా సిబ్బంది పాల్గొన్నారు. మంగళవారం కూడా లెక్కింపు కొనసాగుతుందని ఆలయ ఈవో పేర్కొన్నారు.

పత్తి కొనుగోళ్లకు సీసీఐ కేంద్రాలు

- నేటి నుంచి కొనుగోళ్లు ప్రారంభం
- క్వింటాకు రూ.7,020 మద్దతు ధర



కోయవారిపాలెంలో సీసీఐ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు

ప్రత్తిపాడు: పత్తి కొనుగోళ్లకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 2023–24 సీజన్‌లో రైతులు పంటను ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు సీసీఐ కేంద్రాల్లో విక్రయించుకోవచ్చు. కొనుగోళ్ల కోసం ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) మూడు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రత్తిపాడులోని సహజానంద కాటన్ మిల్స్‌లో ఒక కేంద్రాన్ని, కోయవారిపాలెంలోని శివసాయి టీఎంసీలో రెండో కేంద్రాన్ని, శివ పార్వతి కాటన్ జిన్నింగ్ మిల్లులో మూడో కేంద్రాన్ని సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు లాంఛనంగా ప్రారంభించారు. మంగళవారం నుంచి కొనుగోళ్లు మొదలు కానున్నాయి.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధరను రూ.7,020గా నిర్ణయించింది. సీసీఐ కేంద్రాల్లో పత్తిని అమ్మాలనుకునే రైతులు కచ్చితంగా తమ ఆధార్ కార్డు జిరాక్సుతోపాటు పట్టాదారు పాస్ పుస్తకం నకలుతో రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకుని టోకెన్ పొందాలి. ఆ తరువాత మాత్రమే సీసీఐ కేంద్రాలకు పత్తిని తీసుకువెళ్లాలి. నాణ్యతాప్రమాణాల మేరకు పంట ఉంటేనే అధికారులు కొనుగోలు చేస్తారు.

పంట కొనుగోలు నిబంధనలివీ

- పత్తిని ఆరబెట్టి శుభ్రపరిచి తీసుకు రావాలి.
- తేమశాతం 8 శాతం వరకు ఉండాలి. ఎనిమిది శాతం కంటే ఎక్కువ ఉంటే ఒక్కో శాతానికి రూ.55.50 చొప్పున ధర తగ్గుతుంది.
- పత్తి పింజా పొడవు 29.50 ఎంఎం నుంచి 30.50 ఎంఎం వరకు ఉండాలి.
- మైక్రోనెయిర్ వాల్యూ 3.5 నుంచి 4.3 వరకు ఉండాలి.
- వర్షానికి తడిసిన పత్తిని తీసుకురారాదు.
- దుమ్ము, ధూళి, చెత్తా, చెదారాలు లేకుండా చూసుకోవాలి.
- గుడ్డి పత్తి కాయలు, రంగుమారిన, పురుగు పట్టిన పత్తి కాయలను వేరు చేసి తీసుకు రావాలి.
- నీళ్లు చల్లిన పత్తిని కొనుగోలు చేయరు.
- కొడు పత్తి, ముడుచుకుపోయిన పత్తిని మంచి పత్తితో కలపకూడదు.

రైతులకు మద్దతు ధర

ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో మూడు సీసీఐ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల్లో మంగళవారం నుంచి ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం కొనుగోళ్లు చేపట్టనున్నాం. నాణ్యతా ప్రమాణాలు పాటించి రైతులు పత్తిని తీసుకురావాలి. పత్తి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కె.మాధవరావు, సెక్రటరీ, ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ

జిల్లాలో 8 పత్తి కొనుగోలు కేంద్రాలు

కొరిటిపాడు(గుంటూరు): పత్తి రైతుకు మద్దతు ధర కల్పించేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలో 8 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. గుంటూరు మార్కెట్ యార్డు పరిధిలో కోటేశ్వర కాటన్ జిన్నింగ్ ఇండస్ట్రీస్, శ్రీ వేంకటేశ్వర కాటన్ జిన్నింగ్ మిల్లు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు పరిధిలో శివసాయి కాటన్ జిన్నింగ్ మిల్లు, సహజానంద కాటన్ జిన్నింగ్ మిల్లు, శివ పార్వతి కాటన్ జిన్నింగ్ మిల్లు, తాడికొండ మార్కెట్ యార్డు పరిధిలో శ్రీ మహాలక్ష్మి కాటన్ జిన్నింగ్ మిల్లు, కొలిపెర సుబ్బారావు కాటన్ జిన్నింగ్ మిల్లు, ఫిరంగిపురం మార్కెట్ యార్డు పరిధిలోని పేరేచర్లలో విజయ వెంకటేశ్వర కాటన్ జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మార్కెటింగ్‌శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు సోమవారం 'సాక్షి'కి తెలిపారు. రాజబాబు మాట్లాడుతూ నవంబర్ 1వ తేదీ బుధవారం నుంచి జిల్లాలోని అన్ని జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు తెరిచే ఉంటాయని, రైతులు తమ దగ్గరలో గల ఏదైనా జిన్నింగ్ మిల్లులకు పత్తి తీసుకువెళ్లి పత్తిని అమ్ముకోవచ్చన్నారు. రైతులు ముందుగా రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కేంద్రాల వద్ద మధ్యవర్తులు, దళారులు కనిపిస్తే చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం పొడవు పింజ పత్తి క్వింటా రూ.7,020, పొట్టి పింజ పత్తి రూ.6,620కి సీసీఐ రైతుల నుంచి కొనుగోలు చేయనుందని ఆయన వివరించారు.

పెండింగ్ అర్జీల పరిష్కారానికి కృషి

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: ఏ కారణం చేతైనా అర్జీ పెండింగ్‌లో పెడితే సంబంధిత శాఖాధికారులు వాటిని తప్పకుండా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వారంలోపే అర్జీలు పరిష్కరించాలన్నారు. పరిష్కారానికి అవకాశంలేని అర్జీలను సిబ్బంది జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. ప్రజా సమస్యలు అతి త్వరగా పరిష్కారమయ్యే వేదిక స్పందన అని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ఒక్కరిద్దరి దురుసు ప్రవర్తన అందరికీ చెడ్డపేరు తెస్తోందని చెప్పారు. అనంతరం వచ్చిన 194 అర్జీలను కలెక్టర్ జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు.

రోడ్డును ఆక్రమించారు

ఫిరంగిపురం మండలం వేములూరుపాడులో సుమారు 400 కుటుంబాలు జీవిస్తున్నాం. ఇటీవల మేము నడిచే కాలిమార్గంలో ఒక వ్యక్తి ఇల్లు కట్టుకుని రోడ్డును మూసేశాడు. అడుగుతుంటే రౌడీయిజం చేస్తున్నాడు. దారిలేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. స్థానిక అధికారులు చెప్పినా వినడంలేదు. న్యాయం చేయండి.

– వేములూరిపాడు గ్రామస్తులు

పంచాయతీలో నిధుల గోల్‌మాల్

కాకుమాను మండలం, బోడిపాలెం గ్రామ పంచాయతీలో రహదారులు వేయకుండా వేశామని చెప్పి రూ.10 లక్షలు కాజేశారు. దీనిపై విచారించిన అధికారులు నిధుల గోల్‌మాల్ వాస్తవమని రిపోర్ట్ ఇచ్చారు. రాజకీయ అండతో చర్యలు లేకుండా అక్రమార్కులు తొక్కిపెడుతున్నారు. పరిశీలించగలరు.

– ఎం.రామయ్య, జేమ్స్, బోడిపాలెం గ్రామస్తులు

క్లుప్తంగా

అంబటిపై దాడి టీడీపీ దివాళా కోరుతనానికి నిదర్శనం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాణిక్యవరప్రసాద్



నగరంపాలెం: మంత్రి అంబటి రాంబాబుపై ఖమ్మంలో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. సోమవారం గుంటూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ పోలీసులను కోరుతున్నామన్నారు. టీడీపీ దివాళా కోరుతనానికి ఇందుకు నిదర్శనమన్నారు. రానున్న రోజుల్లో ఇటువంటి ఘటనలను తిప్పికొడతామని స్పష్టం చేశారు.

కాపు కులంపై దాడి: అడపా శేషు



కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మాట్లాడుతూ అంబటి రాంబాబుపై దాడికి పాల్పడటం దుర్మార్గమని అన్నారు. మంత్రి అంబటి ఒక స్పోక్ మ్యాన్‌గా, మంత్రిగా, ప్రజాశ్రేయస్సు కోసం, కాపుల మనోభావాలను గౌరవం పెంచే వ్యక్తి అని, కించపరిచే వ్యక్తి కాదని చెప్పారు. కానీ కాపు కులంపై ఒక సామాజిక వర్గం 1988లో వంగవీటి మోహన్ రంగాను ఎన్నో ఇబ్బందులు పెట్టిందని గుర్తుచేశారు. చివరకు తుది ముట్టించారని అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కాపు సామాజిక వర్గానికి రాజకీయాలలో పెద్దపీట వేస్తున్నారని, పలువురికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతరత్రా పదవులు కేటాయించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. నార్త్ అమెరికా ఏపీ స్టేట్ గవర్నమెంట్ ప్రత్యేక రిప్రజెంటేటివ్ పండుగాయల రత్నాకర్ మాట్లాడుతూ చంద్రబాబుకి, టీడీపీకి కాపులను కాకులుగా చూడటం అలవాటు అన్నారు.

5న వెయిట్ లిఫ్టర్ల ఎంపిక

తెనాలిరూరల్: గుంటూరు జిల్లా తక్కెళ్లపాడులోని శివాలయ ప్రాంగణంలో నవంబర్ 5వ తేదీన జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి చింతా మల్లికార్జునరావు తెలిపారు. జిల్లా పోటీల్లో భాగంగా ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన క్రీడాకారులను నరసన్నపేటలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

4న గుంటూరులో సామాజిక సాధికార బస్సు యాత్ర

రాజ్యసభ సభ్యులు అయోధ్యరామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యే ముస్తఫా

పాతగుంటూరు: గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 4వ తేదీ నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సును విజయవంతం చేయాలని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. సోమవారం గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా అధ్యక్షతన ఆయన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిందన్నారు. 2024లో సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక సాధికార బస్సు యాత్ర ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలు, నాయకులకు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే బస్సు యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ సంగడిగుంట మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నుంచి బస్సు యాత్ర ప్రారంభమై మాయాబజారు సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతోందన్నారు. నాయకులు, కార్యకర్తలు, నగర ప్రజలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా, నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు), తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు అడపా శేషు, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ బేగం, కృష్ణబలిజ పూసల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని మణికంఠ, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గులాం రసూల్, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం అంటగట్టారు

- జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో బాధితుడి ఫిర్యాదు
- ఉద్యోగం పేరిట మోసపోయానంటూ మరొకరు..



అర్జీదారుల సమస్యలను ఆలకిస్తున్న జిల్లా ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), శ్రీనివాసరావు

నగరంపాలెం: బంగారం పేరుతో మోసగించారంటూ బాధితుడు పోలీసులనాశ్రయించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పలు సమస్యలపై అర్జీదారులు ఫిర్యాదులు చేశారు. అర్జీదారుల నుంచి జిల్లా ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), ఎ.శ్రీనివాసరావు (క్రైం) స్వీకరించి వారి సమస్యలను ఆలకించారు. అనంతరం పలు సబ్ డివిజన్లు, పోలీస్‌స్టేషన్ల పోలీస్ అధికారులతో మొబైల్ ఫోన్లలో, వీసీ ద్వారా మాట్లాడారు. చట్ట పరిధిలో స్పందన సమస్యలను పరిష్కరించాలని ఏఎస్పీ ఆదేశించారు. డీఎస్పీలు బాల సుందరరావు (ట్రాఫిక్), శ్రీనివాసరావు (డీసీఆర్‌బీ) అర్జీలు స్వీకరించారు.

ఫిర్యాదు చేశానని..

కొద్ది నెలలు క్రితం దేవదాయ శాఖ భూమిని మైనింగ్ నిమిత్తం పాడుకున్నారు. అయితే రెండు అడుగుల మేరకు తవ్వాలని చెప్పారు. అయితే ఆ వ్యక్తి 8 అడుగులు తవ్వకోవడంపై మైనింగ్, రెవెన్యూ శాఖలకు ఫిర్యాదు చేశా. ఈ క్రమంలో సదరు వ్యక్తి తనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీస్ అధికారి తనపట్ల అమర్యాదగా మాట్లాడారు.

– సదాశివరావు, వట్టిచెరుకూరు.

ఉద్యోగం ఇప్పిస్తానని..

విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించారు. నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి పరిచయమై, విదేశాలలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో అతని మాటలు నమ్మి సోదరుడి పిల్లలు కోసం సరేనని ఒప్పుకున్నారు. ఈ క్రమంలో అతనికి రూ.20 లక్షలు చెల్లించారు. నెలలు గడిచినా ఉద్యోగం ఊసెత్త లేదు. డబ్బులిచ్చి ఏడాది గడిచినా ఫలితం లేదు. న్యాయం చేయాలి.

–సాంబశివరావు, కట్టివరం తెనాలి.

డబ్బులు ఇప్పించాలి

బంగారం పేరుతో మోసగించారని ఓ చిరు వ్యాపారి వాపోయాడు. ఇటీవల ఏటీ అగ్రహారం వాసి తమ ఇంటికి వచ్చి బళ్ళారిలోని పొలంలో లంకె బిందెలు దొరికాయని నమ్మబలికాడు. తొలుత ఒక బంగారు బిళ్ల ఇవ్వగా, అది సరి చూపించగా బంగారం అని తేలింది. కిలో బంగారం ఉందని రూ.10 లక్షలు అవుతుందని చెప్పగా, అంత డబ్బుల్లేవని చెప్పడంతో సరేనని చెప్పాడు. దీంతో అతని మాటలు నమ్మి గతనెల 17న రూ.5.50 లక్షలకు బేరం కుదుర్చుకుని, అతనికి డబ్బులు చెల్లించా. అనంతరం బళ్ళారి వెళ్లాం. అక్కడ డబ్బులు యిచ్చి బంగారం తెస్తానని చెప్పి, రెండు కర్చీఫ్ మూటలు తీసుకొచ్చాడు. ఆ మూటలోని వస్తువులను పట్నం బజార్‌లో చూపించగా నకిలీ బంగారం అని తేలింది. దీంతో అతన్ని డబ్బులు అడగ్గా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేశాడు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. మోసగించిన వ్యక్తి నుంచి డబ్బులు ఇప్పించాలి.

– పి.వెంకటరెడ్డి, ఏటీఅగ్రహారం.

జాగ్రత్తలతోనే మధుమేహ నివారణ

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, డాక్టర్ అమర్తలూరి శ్రావణబాబు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ అమర్తలూరి శ్రావణబాబు, డాక్టర్ సేవకుమార్, పి.రమేష్

గుంటూరు మెడికల్: మధుమేహం, అధిక రక్త పోటు, క్యాన్సర్ వంటి వ్యాధులు సమాజంలో విపరీతంగా పెరిగిపోతున్నాయని, ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా ఆ వ్యాధుల పట్ల శాస్త్రీయ అవగాహన పెంచుకుని నిరోధించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ బాబు అన్నారు. . సోమవారం స్థానిక బ్రాడీపేట 2వ లైనులోని ఎస్ హెచ్ ఓ సమావేశ మందిరంలో ప్రపంచం మధుమేహ నిరోధక మాసం సందర్భంగా ప్రజా ప్రయోజనార్థం సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా 'మధుమేహం–కారణాలు–నిరోధక చర్యలు ' అంశంపై నవంబర్ నెల రోజుల పాటు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల కరపత్రాన్ని డాక్టర్ శ్రావణ్ బాబు ఆవిష్కరించారు. కార్యక్రమానికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ అధ్యక్షత వహించారు. డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ ప్రజల జీవన శైలిలో, ఆహారంలో మార్పులే మధుమేహంకు కారణమవుతున్నాయన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ ప్రజల్లో ఈ దీర్ఘకాల వ్యాధుల నిరోధమే లక్ష్యంగా తమ సంస్థలు నెలరోజుల ఈ ప్రజా చైతన్య కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందన్నారు. ఎస్‌హెచ్ఓ అధ్యక్షుడు డాక్టర్ తాతా సేవకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రాణాంతక వ్యాధు లు వేగంగా పెరిగిపోతున్నాయన్నారు. నవంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు నెల రోజులపాటు చైతన్య కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, నిర్ధారణ, పర్యవేక్షణ పరీక్షలను ఎస్‌హెచ్‌ఓలో నిర్వహిస్తున్నామన్నారు.

పీజీ మెడికల్ సీటు ఇప్పిస్తానని డాక్టర్‌కు టోకరా

- రూ.26,50,000 వసూలు చేసి పరారీ

పెదకాకాని: ఎంబీబీఎస్ పూర్తి చేసిన వ్యక్తికి పీజీ సీటు ఇప్పిస్తానని ఘరానా మోసం చేసిన సంఘటన పెదకాకాని పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం గుంటూరుకు చెందిన అభిరామ్ యశస్వి ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ చేసేందుకు సిద్ధమయ్యాడు. తల్లిదండ్రులు మండలంలోని గడ్డిపాడు సమీపంలో యశస్వి ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. అభిరామ్‌కు వరుసకు బాబాయి అయిన అగస్త్య శ్రీనివాస్ రాజమండ్రిలో డాక్టరుగా పనిచేస్తున్నాడు. డాక్టర్ అగస్త్య శ్రీనివాస్ కుమారుడు, కుమార్తెలకు వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు గ్రామానికి చెందిన పోకల చంద్రశేఖర్ కర్ణాటక రాష్ట్రంలో పీజీ చదివేందుకు సీట్లు ఇప్పించాడని, చాలా నమ్మకమైన వ్యక్తి అని అభిరామ్‌కు పరిచయం చేశాడు. ఈ విధంగా పరిచయమైన పోకల చంద్రశేఖర్ యశస్వి ఆసుపత్రి వద్దకు వెళ్లి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో ఉన్న చాలా మెడికల్ కాలేజీలకు ఏజెంట్‌గా పనిచేస్తున్నానని, కౌన్సెలింగ్‌తో పనిలేకుండా సీటు ఇప్పిస్తానని పరిచయం చేసుకున్నాడు. తమిళనాడు రాష్ట్రంలోని మేల్‌మరువత్తూరు ఆదిపరాశక్తి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో పీజీ సీటు ఇప్పిస్తానని నమ్మించాడు. సీటు రూ.1.25 కోట్లు అవుతుందని, అడ్వాన్స్‌గా రూ.26,50,000 ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ ఏడాది మే 26వ తేదీ నుంచి అక్టోబరు 26వ తేదీ వరకూ దశల వారీగా డబ్బులు తీసుకున్నాడు. డబ్బులు తీసుకుంటున్న ప్రతిసారీ మీ సీటు మీకు గ్యారంటీ అంటూ నమ్మబలికేవాడు. చివరిసారిగా పీజీలో చేరేందుకు చెన్నై వెళ్లిన డాక్టర్ కుటుంబం ఉన్న రూము వద్దకు వెళ్లి పీజీ సీటు అడ్వాన్స్ రూ.26,50,000 సంబంధించిన బ్యాలెన్స్ రూ.6,50,000 తీసుకుని 27వ తేదీ ఉదయం 10 గంటలకు వచ్చి కళాశాలలో జాయిన్ అవ్వాలని చెప్పి వెళ్లిపోయాడు. ఉదయం ఫోన్ చేయగా పోకల చంద్రశేఖర్ ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. కళాశాలలోకి వెళ్లి విచారించగా కౌన్సెలింగ్ అయిపోయిందని, క్లాసులు కూడా ప్రారంభమయ్యాయని సమాధానం చెప్పారు. దీంతో నిర్ఘాంతపోయిన డాక్టర్ పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈవీఎంల భద్రతలో రాజీవద్దు

- అవినీతిని ప్రోత్సహించకండి
- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ ఉండకూడదని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గోడౌన్లను, భద్రత, సీసీ కెమేరా వ్యవస్థను, రికార్డులను కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థకు ఈవీఎంలు ఎంతో కీలకమన్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా అది ఎన్నికల వ్యవస్థపై పడుతుందని పేర్కొన్నారు. ఇబ్బందులుంటే ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ వివరించారు. డీఆర్వో చంద్రశేఖరరావు, గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్, పశ్చిమ మండల తహసీల్దార్ సాంబశివరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలన

ఫిరంగిపురం: మండలంలోని రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో భద్రపరిచిన ఈవీఎంలను సోమవారం జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈవీఎంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు.

ప్రభుత్వ సేవలు పొందడం ప్రజల హక్కు

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ సేవలు పొందడం ప్రజల హక్కని వాటిని పొందేందుకు లంచం ఇవ్వొద్దని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన విజిలెన్స్ వారోత్సవాల కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సేవలను పారదర్శకంగా ప్రజలు పొందేందుకు అనేక విధానాలు అమలులోకి తెచ్చిందన్నారు. సంక్షేమ పథకాల సొమ్ములను మధ్యవర్తులు లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకే వెళుతుందని చెప్పారు. దీనివల్ల కిందిస్థాయిలో లంచాల గొడవ బాగా తగ్గిందని పేర్కొన్నారు. లంచం తీసుకున్న వారు, ఇచ్చిన వారు కూడా నేరస్తులేనని చెప్పారు. రైతులు కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వీటిని నివారించేందుకు విజిలెన్స్ శాఖ మరింత విస్తృత సేవలందించాలని, ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. మనకు, మన కుటుంబానికి అండగా నిలుస్తున్న ప్రభుత్వ ఉద్యోగాన్ని ఎంతో పవిత్రంగా భావించాలన్నారు. అనంతరం అవినీతి రహిత సమాజం కోసం పని చేస్తామని జె.రాజకుమారి, విజిలెన్స్ ఎస్పీ ఈశ్వర రావు, అడిషనల్ ఎస్పీలు సుప్రజ, ఎం.మహేంద్ర, డీఆర్వో చంద్రశేఖరరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, జిల్లా అధికారులతో ప్రమాణం చేయించారు.

రేపు కాపు విద్యార్థి వసతి గృహం ప్రారంభం



తెలగ అభ్యుదయ సంఘం వసతి గృహం

గుంటూరు రూరల్: తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో నవంబరు 1న ఉదయం 10 గంటలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొదటి కాపు విద్యార్థి వసతి గృహాన్ని ప్రారంభించనున్నట్లు కార్యదర్శి బాలిశెట్టి విజయకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి, తూర్పు కాపు, మున్నూరు కాపు, సోదరులందరూ ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆయన కోరారు. గోరంట్ల శివారులోని విజయదుర్గానగర్, హోసన్న మందిరం పక్క లైనులో వసతి గృహాన్ని నిర్మించినట్లు ఆయన పేర్కొన్నారు. భవన నిర్మాణానికి సహాయ, సహకారాలు అందించిన కాపులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని వసతి గృహాలకు ముఖ్యంగా బాలికల వసతి గృహం ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు.

ఆస్ట్రేలియా-ఇండియా సాంగత్యంపై ప్రత్యేక సమావేశం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ ఆస్ట్రేలియన్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక సమావేశం జరుగుతుందని రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆస్ట్రేలియా కౌన్సెల్ జనరల్ శార కిర్లు హాజరై ఆస్ట్రేలియా-ఇండియా సాంగత్యంపై ప్రసంగించనున్నారని తెలిపారు. సమావేశం ఉదయం 11 గంటలకు డైక్ మన్ ఆడిటోరియంలోని బాల మోహన్ దాస్ సెమినార్ హాల్‌లో ప్రారంభమవుతుందని చెప్పారు. వీసీ ఆచార్య పి.రాజశేఖర్ చీఫ్ ప్యాట్రన్ గా హాజరు కానున్నారన్నారు. ప్రత్యేక అతిథులుగా రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద మూర్తి, యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య సీ.హెచ్.స్వరూప రాణి, ఆచార్య కె.గంగాధరరావు, ఆచార్య పి.జాన్సన్, ఆచార్య పి.సిద్ధయ్య, ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి, ఆచార్య ఎ. ప్రమీలరాణి, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి. చెన్నా రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

యార్డుకు 30,151 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 30,151 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 28,272 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.14,000 నుంచి రూ.22,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.7,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,770 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

మనస్తాపంతో దంపతుల ఆత్మహత్యాయత్నం

- చేబ్రోలులో కాల్వకట్ట వెంబడి పురుగుమందు సేవించి ..
- స్పందించి ద్విచక్ర వాహనంపై వెళ్లి మహిళను కాపాడిన పోలీసులు
- లభించని భర్త ఆచూకీ



మహిళను ద్విచక్ర వాహనంపై రోడ్డుపైకి తీసుకు వస్తున్న కానిస్టేబుల్ సురేష్

చేబ్రోలు: ఆ దంపతులను కొన్నాళ్లుగా కుటుంబ సమస్యలు వేధిస్తున్నాయి. వీటితో సతమతమవలేకపోతున్నారు. మనస్తాపానికి గురయ్యారు. ప్రాణాలు తీసుకుందామని భావించి పురుగుల మందు సేవించారు. అయితే భార్యను పోలీసులు కాపాడి ఆస్పత్రికి చేర్చగా భర్త ఆచూకీ లభ్యం కాలేదు. ఈ ఘటన చేబ్రోలు మండల కేంద్రంలో సోమవారం జరిగింది. గుంటూరు ప్రాంతానికి చెందిన అత్తలూరి సాంబశివరావు, సుజాత దంపతులు కుటుంబ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. సోమవారం గుంటూరు నుంచి వచ్చిన వీరిద్దరు చేబ్రోలు కొమ్మమూరు చానల్ కట్టపై నుంచి సుమారు రెండు కిలోమీటర్లు దూరం వెళ్లారు. అక్కడ ఇరువురు పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మధ్యాహ్న సమయంలో వ్యవసాయశాఖ సిబ్బంది ఇరువురు పొలాల పరిశీలనకు ఆ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ మహిళ నోటి నుంచి నురుగు రావటంతో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితిని గమనించారు. వెంటనే సచివాలయంలోని మహిళా కానిస్టేబుల్‌కు సమాచారం ఇవ్వటంతో వారు చేబ్రోలు పోలీసులను అప్రమత్తం చేశారు.

ప్రాణాలు కాపాడిన పోలీసులు

మహిళ పురుగుమందు సేవించి అపస్మారక స్థితిలో ఉన్న విషయం తెలుసుకున్న వెంటనే స్పందించిన హెడ్ కానిస్టేబుల్ బాణాల హరిబాబు, కానిస్టేబుల్ కట్టా సురేష్‌లు రక్షక్ వాహనంతో సమీప ప్రాంతానికి వెళ్లారు. కొమ్మమూరు చానల్ బ్రిడ్జి నుంచి సుమారు రెండు కి.మీ దూరంలో పొలాలు, చెట్ల మధ్య అపస్మారక స్థితిలో ఉన్న మహిళ వద్దకు 108 వాహనం వచ్చే పరిస్థితి లేదు. కొమ్మమూరు చానల్ బ్రిడ్జి వద్దకు చేరుకున్న అంబులెన్స్ వద్దకు స్కూటీపై పోలీసులు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న మహిళను మధ్యలో కూర్చోబెట్టుకొని పిచ్చిమొక్కలు, దారి సరిగ్గా లేని ప్రాంతం నుంచి జీబీసీ రహదారి మీదకు తీసుకువచ్చారు. స్పృహ కోల్పోయి పరిస్థితి విషమంగా ఉన్న మహిళను 108 సిబ్బంది అత్యవసర వైద్య సేవలు అందించి గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. సంఘటనా ప్రాంతానికి పొన్నూరు రూరల్ సీఐ ఎం.రాంబాబు చేరుకుని కుటుంబసభ్యుల నుంచి సమాచారాన్ని సేకరించారు. అయితే భర్త సాంబశివరావు ఆచూకీ లభ్యం కాలేదు. మహిళ పురుగుమందు సేవించి పడి ఉన్న ప్రాంతం ఉంచి కొద్ది దూరంలో పురుగుమందు డబ్బా, సిగిరెట్టు ముక్కలు ఉండి పొలం బురదలో నుంచి నడిచి వెళ్లినట్లుగా కాలి ముద్రలు ఉన్నాయి. పరిసర ప్రాంతాలను వారి కుటుంబ సభ్యులు, పోలీసులు గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. ఇదిలా ఉంటే సుజాత పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చిన్న కుమారుడు హరీష్ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



విశిష్ట గాయని
రావు బాలసరస్వతీదేవి
వైఎస్సార్
జీవన సాఫల్య పురస్కారం
అందుకోనున్న
సందర్భంగా...

గాన సరస్వతి

పువ్వుకు రాగం అబ్బితే ఎలా ఉంటుంది?
ఆ పువ్వు స్వరాన్ని ఎలా సవరించుకుంటుంది?
ఆ తావి గానాన్ని ఎలా శ్రుతి చేసుకుంటుంది?
అక్షరాలను పూలరెక్కల్లా పొదివి పట్టుకుంటుంది.
సరిగమలు కందకుండా సున్నితంగా గానం చేస్తుంది.
ఆ గాన సరస్వతి... మన రావు బాలసరస్వతీదేవి.

పువ్వు పాడితే ఎలా ఉంటుందో... రావు బాల సరస్వతీదేవి పాట వింటే తెలుస్తుంది. హైదరాబాద్, మణికొండలోని గాయత్రి ప్లాజాలో ఆమె ఫ్లాట్ గోడలు ఆ గానసరస్వతి రాగాలను నిత్యం వింటుంటాయి. తొంభై ఐదేళ్ల వయసులో కూడా ఆమె స్వరంలో రాగం శ్రుతి తప్ప లేదు. తొంభై ఏళ్లుగా సాగుతున్న సాధనతో ఆ స్వరం అద్దుకున్న తియ్యదనం అది. పారిజాత పువ్వులాంటి మృదుత్వం ఆమె రాగానిది. ఆ గొంతు సన్నజాజి మొగ్గలా పరిమళం వెదజల్లుతోందిప్పటికీ. ఆ సుమధుర గానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. తొమ్మిది దశాబ్దాల ఆమె సంగీత సేవను గౌరవిస్తోంది. నవంబర్ ఒకటవ తేదీన (రేపు) ఆమె వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్నారు.

గ్రామఫోన్ నుంచి సీడీల వరకు

సరస్వతి నాలుగవ ఏట నుంచి వేదికల మీద పాడుతున్నారు. ఆరవ ఏట హెచ్.ఎం.వి కంపెనీ ఆమె పాటను గ్రామఫోన్‌లో రికార్డు చేసింది. తెలుగు సినిమాలో తొలి నేపథ్య గాయనిగా రికార్డు ఆమెదే. ఆకాశవాణి కేంద్రాలు మద్రాసు, విజయవాడ స్టేషన్‌ల కోసం ప్రారంభగీతం పాడిన రికార్డు కూడా ఆమెదే. తెలుగు, తమిళ, కన్నడ భాషలతోపాటు సింహళ గీతాలనూ ఆలపించారు. బాలనటిగా, బాల గాయనిగా సినీరంగం ఆమెను గారం చేసింది. పేరు ముందు 'బాల'ను చేర్చింది. కర్ణాటక సంగీతం, హిందూస్థానీ సంగీతాలు సాధన చేసింది. సినిమా షూటింగ్‌ల కారణంగా స్కూలుకెళ్లడం కుదరకపోవడంతో ఆమె చదువు కోసం ట్యూటర్ ఇంటికి వచ్చి పాఠాలు చెప్పేవారు. ఆమెకు ఇంగ్లిష్ నవలలు చాలా ఇష్టం. ఆ అలవాటును ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. గ్రామఫోన్ రికార్డుల కాలం నుంచి క్యాసెట్ టేప్‌లో రికార్డ్ చేసే టెక్నాలజీని చూశారు. సీడీలు, ఎంపీత్రీలనూ చూశారు. టెక్నాలజీతోపాటు అప్‌డేట్ అవుతూ వచ్చారు. కానీ, సినిమా సంగీతం, సాహిత్యంలో వచ్చిన భాషాపరంగా విలోమమవుతున్న ప్రమాణాలను అంగీకరించలేకపోయారు. సినిమా అంటే శక్తిమంతమైన వినోదసాధనం. పిల్లలు, యువతకు మానసిక వికాసం, మేధో వికాసంతోపాటు వాళ్ల అభివృద్ధికి... వినోదం అనే సాధనంతో బాటలు వేసే గొప్ప కళామాధ్యమంగా ఉండాలి సినిమా. అంతే తప్ప విలువలను దిగజార్చుకునే సాధనం కాకూడదని చెబుతారామె. రెండు వేలకు పైగా పాటలు పాడిన ఈ సంగీత సరస్వతి ఈ రోజుల్లో పాటల సాహిత్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.



● పాట రికార్డింగ్ సమయంలో ఆరేళ్ల బాల సరస్వతీదేవి

సినిమాలకు మాత్రమే దూరం... స్వరానికి కాదు!

పెళ్లి తర్వాత పదిహేనేళ్లకు బాల సరస్వతీదేవి సినిమాల కోసం పాడడం మానేశారు. కానీ సంగీత సాధన మాత్రం ఆపలేదు. సినారె తెలుగులోకి అనువదించిన మీరాభజన్ గీతాలను ఆలపించారామె. ఎనభై ఏళ్ల వయసులో ఆమె తనకిష్టమైన కొన్ని లలిత గీతాలను ఎంచుకుని స్వీయ సంగీత దర్శకత్వం వహించి 'రాధా మాధవం' సీడీ విడుదల చేశారు. కోవిడ్‌కి ముందు 2018లో అంటే ఆమె తొంబయ్యేళ్ల వయసులో 'స్వరాభిషేకం' కార్యక్రమంలో పాడడమే ఆమె చివరి వేదిక. ఆ వేడుక తర్వాత మూడవ రోజు ఇంట్లో జరిగిన ప్రమాదం ఆమెను ఇంటికే పరిమితం చేసింది. అయితే ఆశ్చర్యంగా జారి పడడంతో విరిగిన తుంటి ఎముక దానంతట అదే సరయింది. సంగీతమే తనను స్వస్థత పరిచిందంటారామె. ఇప్పటికీ రోజూ ఆ స్వరం రాగాలను పలుకుతుంటుంది. ఆమె ఊపిరితిత్తులకు శక్తినిస్తున్నది సంగీతమేనని వైద్యులు కూడా నిర్ధారించారు.



● భర్త, పిల్లలతో బాలసరస్వతీ దేవి

పాట కలిపింది ఇద్దరినీ!

చెన్నై (మద్రాసు) లో పుట్టి పెరిగిన బాల సరస్వతి పెళ్లి తర్వాత కోడలిగా కోలంక జమీందారీలో అడుగుపెట్టారు. ప్రకృతి ఇద్దరు వ్యక్తులను దూరం చేసిన విషాదాంతాలను సినిమాల్లో చూస్తుంటాం. కానీ ప్రకృతి ఇద్దరు మనుషులను దగ్గర చేయాలనుకుంటే చాలా చమత్కారంగా దగ్గర చేస్తుంది. అందుకు ఈ గానసరస్వతి పెళ్లే గొప్ప ఉదాహరణ. ''నా పాటను వినడానికి స్వయంగా కోలంక జమీందార్... శ్రీ రాజారావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావు గారు మద్రాసులో మా ఇంటికి వచ్చారు. నేనప్పుడే 'కలువ రేకుల కనులు గల నా స్వామీ' అనే పాట రికార్డింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాను. మా నాన్న పాట పాడమనగానే అదే పాట పాడాను. రాజా వారేమో తన పెద్ద కళ్లను వర్ణిస్తూ, వారి మీద ప్రేమను అలా పాట రూపంలో వ్యక్తం చేశాననుకున్నారట. అదే మా పెళ్లికి నాందీ గీతం' అంటూ ఆనాటి జ్ఞాపకాన్ని సంతోషంగా గుర్తు చేసుకున్నారామె. అందుకే తనకు ఇష్టమైన ప్రదేశం మద్రాసేనని చెబుతారామె.

ఈ బాల రెండో బాల్యమిది!

బాలసరస్వతీ దేవికి హాఫ్ వైట్ పట్టు చీరలిష్టం. క్రీమ్ కలర్‌తో అనేక రంగుల కాంబినేషన్‌లలోనే ఎక్కువగా కనిపిస్తారు. ఆమెకు మల్లెపూలన్నా ఇష్టమే. ఇక స్వీట్స్... ముఖ్యంగా గులాబ్ జామూన్, జాంగ్రీలను చూస్తే చిన్న పిల్లయిపోతారు. చాక్లెట్ చేతికిస్తే పసి పిల్లల ముఖం వికసించినట్లే ఆమె ముఖంలో నవ్వులు పూస్తాయి. భోజనం గుప్పెడే కానీ, ఆ వెంటనే స్వీట్ తినడం ఆమె కిష్టం, ఆ తర్వాత తియ్యగా పాడడం మరింత ఇష్టం. ఆ సరిగమల వారసత్వం ఇద్దరు కొడుకులకు రాలేదు, మనుమడు, మనుమరాలికీ రాలేదు. కానీ మనుమరాలి కూతురు నేహకు వచ్చింది. గానసరస్వతి కళ్ల ముందే ఆ ఇంట్లో సరిగమల కొత్తతరం వెల్లివిరుస్తోంది. తొంబై ఐదేళ్ల వయసులో హైదరాబాద్‌లోని పెద్ద కుమారుని ఇంటిలో ప్రశాంతంగా పసిబిడ్డలా జీవిస్తున్నారు బాల సరస్వతీదేవి. కన్నతల్లిని 'కన్నక్కా' అని పిలుస్తూ తల్లిని కన్నబిడ్డలా చూసుకుంటున్నారాయన. కోడలు అత్తగారి చిన్నప్పటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుంటూ ఆమెను అపురూపంగా చూసుకుంటున్నారు. సాక్షి ఇంటర్వ్యూలో ఆమె కొన్ని సంగతులు చెప్తూ మధ్యలో మర్చిపోతుంటే ఆమె పెద్ద కొడుకు, పెద్ద కోడలు అందుకుని పూర్తి చేయడమే అందుకు నిదర్శనం.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: మోహనాచారి

మల్టీ టాలెంట్



● బిజినెస్ లీడర్‌గా...

తేజో చంద్రిక

ఆరోజు...
'అలాగే' అని తల ఆడించి ఉంటే 'పవర్ ఫుల్ ఉమన్'గా ప్రపంచ వ్యాప్తంగా చంద్రిక పేరు తెచ్చుకునేది కాదు.
'ఉద్రిక్త పరిస్థితులు ఉన్న ఈ ఊళ్లో ఒక్కరోజు కూడా ఉండలేను' అని భయపడి ఉండే ఉద్యోగజీవితంలోకి వచ్చేది కాదు. తనను తాను నిరూపించుకునేది కాదు.
'లాయర్ కావాలనుకున్నాను. ఈ ఉద్యోగం ఏమిటి' అని నిట్టూర్చి ఉంటే చంద్రిక కొత్త శిఖరాలు అధిరోహించేది కాదు.
'ఉద్యోగ జీవితానికే టైమ్ లేదు. ఇక సంగీతానికి స్థానం ఎక్కడ' అని సర్దుకుపోయి ఉంటే సంగీత ప్రపంచంలో తనదైన పేరు తెచ్చుకునేది కాదు. ప్రపంచ గుర్తింపు పొందిన బిజినెస్ లీడర్, గ్రామీ-నామినేటెడ్ ఆర్టిస్ట్‌గా, దాతగా ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తుంది చంద్రిక....

'అవసరం లేదు' ఒక మాటలో తేల్చేసింది అమ్మ. మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో డిగ్రీలో చేరాలనుకుంటున్న చంద్రికకు ఆ మాట శరాఘాతం అయింది. 'ఆ కాలేజీలో తక్కువమంది మాత్రమే అమ్మాయిలు ఉన్నారు. అంతా అబ్బాయిలే' అన్నది అమ్మ. చంద్రిక చాలా సేపు అమ్మతో వాదించినా ఫలితం కనిపించలేదు.

ఇంట్లోనే నిరాహార దీక్ష చేసింది. దీంతో చంద్రిక మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో చదవడానికి తల్లి ఒప్పుకోక తప్పింది కాదు. మూడు సంవత్సరాల కాలేజీ జీవితం చంద్రిక జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. సంగీతప్రపంచంతో అనుబంధానికి, సింగర్‌గా పేరు తెచ్చుకోవడానికి కారణం అయింది.

డిగ్రీలో చేరడమే కష్టం అనుకున్న చంద్రిక ఆ తరువాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ చేరడం పెద్ద విజయం. నిజానికి చంద్రికకు బిజినెస్ ప్రపంచంపై పెద్దగా ఆసక్తి లేదు. తాతలాగే లాయర్ కావాలనుకుంది. అయితే ప్రొఫెసర్ స్వామినాథన్ సూచన మేరకు బిజినెస్ స్కూల్‌లో చేరింది. మొదటి కొన్నిరోజులు చాలా కష్టంగా అనిపించింది. ఎందుకంటే సొంత ఊరు దాటి అంత దూరం రావడం అదే మొదటిసారి.

ఆ ఒంటరితనానికి దూరం కావడానికి సంగీతానికి దగ్గరైంది. చంద్రిక తొలి ఉద్యోగం సిటీబ్యాంక్‌లో. బ్యాంకర్ కావాలని కలలో కూడా అనుకోని చంద్రికకు ఇది వింతగా అనిపించింది. ట్రైనింగ్ ప్రోగ్రామ్ కోసం లెబనాన్‌లోని బీరుట్ వెళ్లింది. యుద్ధానికి సంబంధించి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో అక్కడకు వెళ్లింది. అక్కడ అయిదు నెలల పాటు ఉంది. సిటీబ్యాంక్ తరువాత వేరే సంస్థల నుంచి చంద్రికకు అవకాశాలు రావడం మొదలైంది. అలా అమెరికాలోకి అడుగు పెట్టింది. ఉద్యోగంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ తనకు ఇష్టమైన సంగీతప్రపంచాన్ని మాత్రం చంద్రిక విడిచి బయటికి రాలేదు. ఎన్నో ఆల్బమ్స్ ద్వారా సక్సెస్‌ఫుల్ మ్యూజిషియన్‌గా తనను తాను నిరూపించుకుంది. సెకండ్ ఆల్బమ్ 'సోల్ కాల్' గ్రామీ అవార్డ్-బెస్ట్ కాంటెంపరరీ వరల్డ్ మ్యూజిక్ ఆల్బమ్ విభాగంలో నామినేట్ అయింది.

గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ మెకెంజీకి ఫస్ట్ ఇండియన్ ఉమెన్ పార్ట్‌నర్‌గా అరుదైన ఘనత సాధించింది. అడ్వైజరీ సంస్థ 'టాండన్ క్యాపిటల్స్ అసోసియేషన్స్' ప్రారంభించి సూపర్ సక్సెస్ అయింది.

ఈ ప్రయాణంలో చంద్రికకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. కుటుంబజీవితం, వృత్తి జీవితాన్ని సమన్వయం చేసుకోవడం కూడా అందులో ఒకటి. అయితే ప్రతి సవాలును అధిగమిస్తూ ముందుకు వెళ్లింది. సవాలు ముందుకు వచ్చినా, ఒత్తిడి తలలో దూరినా తన దగ్గర ఉన్న బ్రహ్మాస్త్రం సంగీతం. పాటలు వినడం, పాడడం తనకు ఎంతో ఇష్టం. అదే తన బలం. తాజాగా 'అమ్మాస్ ట్రెజరర్స్' ఆల్బమ్‌తో ముందుకు వచ్చింది చంద్రిక. ఇది పిల్లలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఆల్బమ్.




● సుమధుర గాయనిగా...

సాగుబడి
స్వాతి కార్తె:
నవంబర్ 6 వరకు

- బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పెంపకంతో రైతులకు ఆదాయం, పర్యావరణానికి మేలు
- సేంద్రియ వ్యర్థాలను ప్రొటీన్లతో కూడిన ఆహారంగా మార్చుతున్న బ్లాక్ సోల్జర్ ఈగలు
- బిఎస్ఎఫ్ లార్వాలు (పిల్ల పురుగులు) కోళ్లకు, చేపలు, రొయ్యలకు, పెంపుడు కుక్కలకు శ్రేష్ఠమైన పౌష్టికాహారం
- 30 రోజులకో బ్యాచ్ చొప్పున బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను ఇంటిపట్టునే సులువుగా పెంచవచ్చు
- బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకంలో ఉప ఉత్పత్తిగా వెలువడే సేంద్రియ ఎరువుతో అదనపు ఆదాయం
- దేశంలోనే మొట్టమొదటిగా తెలంగాణ వ్యవసాయ వర్సిటీలో ఐసిఎఆర్ ఎన్ఎహెచ్ఇపి ప్రాజెక్టు ద్వారా పైలెట్ యూనిట్ ఏర్పాటు
- శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు శిక్షణ ఇవ్వనున్న పిజెటిఎస్ఎయు

బ్లాక్ సోల్జర్ ఈగలతో ప్రొటీన్ల సేద్యం!



సేంద్రియ వ్యర్థాలను ఆహారంగా తిని పెరిగే బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పిల్ల పురుగు(లార్వా)లు కోళ్లతో పాటు చేపలు, రొయ్యలకు మంచి ప్రొటీన్లతో కూడిన మేతగా ఉపయోగపడుతున్నాయి. విదేశాల్లో విస్తారంగా జరుగుతున్న బిఎస్ఎఫ్ లార్వా సాగు ఇప్పుడిప్పుడే మన దేశంలోనూ వ్యాపిస్తోంది. కుళ్లిన పండ్లు, కూరగాయలు, వంటింట్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలను తిని ఈ పిల్ల పురుగులు దాదాపు నెల రోజుల్లోనే పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. బిఎస్ఎఫ్‌పై పరిశోధనలు మన దేశంలో శైశవ దశలో ఉన్నాయి. ఐసిఎఆర్ గ్రాంటుతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం(పిజెటిఎస్ఎయు) ఏడాది క్రితమే వేస్ట్2వెల్త్ ప్రాజెక్టులో భాగంగా దీనిపై పరిశోధనలు చేపట్టింది. అంతేకాదు, శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతుల శిక్షణకు ఇటీవలే శ్రీకారం చుట్టింది. ఇన్నోవేటివ్ ఇన్‌సెక్ట్ ఫార్మింగ్ వివరాలతో ఆసక్తికర కథనం...

ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తయిన శాకాహార, మాంసాహారోత్పత్తుల్లో 60% మాత్రమే వినియోగమవుతోంది. పొలంలో 8%, మార్కెట్‌కు వెళ్లే దారిలో 14%, రిటైల్ అమ్మకందారుల వద్ద 7%, ఇళ్లలో వినియోగానికి ముందు 11% మేరకు ఆహారం వృథా అవుతోంది. 2021 యుఎన్ఇపి ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ ప్రకారం మన దేశంలో ఏటా 6.88 కోట్ల టన్నుల ఆహార వ్యర్థాలు వెలువడుతున్నాయి. ఈ సేంద్రియ వ్యర్థాలను చెత్తకుప్పల్లో వేసే కంటే పునర్వినియోగించి ప్రయోజనం పొందటం తెలివైన పని. ఈ పనిని ఇతర పురుగుల కన్నా బ్లాక్ సోల్జర్ ఈగలు (బిఎస్ఎఫ్) సమర్థవంతంగా చేయగలవన్నది నిపుణుల మాట.

పురుగుల సేద్యం చాలా వినూత్నమైనది, పర్యావరణ హితమైనది, ఆదాయాన్ని అందించేది కూడా. మన దేశంలో కొందరు వ్యాపారవేత్తలు, కోళ్ల రైతులు బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పిల్ల పురుగుల(లార్వా)ను సాగు చేయటం ఇటీవల ప్రారంభించారు. బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల ఉత్పత్తి కాలం వాటికి వేసే ఆహారాన్ని బట్టి మారుతుంది. ఒక బ్యాచ్ 20 రోజుల నుంచి 40 రోజుల వరకు పడుతుంది. ఆహారం మెత్తగా, త్వరగా జీర్ణించుకునే విధంగా ఉండి ప్రొటీన్లతో కూడి ఉన్నప్పుడు తక్కువ రోజుల్లోనే పురుగులు పెరుగుతాయి.

లేయర్ కోళ్ల ఫారాల్లో ఇనుప కేజ్‌ల కింద పోగుపడే కోళ్ల పెంటపై బిఎస్ఎఫ్ ఈగల 5 రోజుల పిల్లలను వదిలితే చాలు.. ఆ వ్యర్థాలనే ఆహారంగా తింటూ 25–30 రోజుల్లోనే పిల్ల పురుగులు వృద్ధి చెందుతాయి.

బిఎస్ఎఫ్ పెంపకం ద్వారా సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లో 70–80% మేరకు కుదించవచ్చు. అందువల్లనే నగరాలు, పట్టణాల్లో పోగుపడే సేంద్రియ వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణకు ఇవి ఉపయోగపడుతున్నాయని ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) చెబుతోంది. బిఎస్ఎఫ్ లార్వా(పిల్ల పురుగులు) బరువులో 40–45% వరకు ప్రొటీన్లు ఉన్నాయి. అందువల్ల కోళ్ల మేతలో, ఆక్వా మేతల తయారీలో సోయా చిక్కుళ్లు, ఫిష్ మీల్‌తో పాటుగా 10 శాతం వరకు బిఎస్ఎఫ్ పురుగుల పొడిని కలుపుతున్నారు. బతికి ఉన్న పిల్ల పురుగుల (వెట్ లార్వా)ను కోళ్లకు నేరుగా మేతగా వేస్తున్నారు. రోజువారీ మేతలో పది శాతం వరకు ఈ పిల్ల పురుగులను అందిస్తూ సత్ఫలితాలు పొందుతున్న కోళ్ల ఫారాలు తెలుగు నాట ఇప్పటికే అనేకం ఉన్నాయి.



● బ్లాక్ సోల్జర్ ఫ్లై గుడ్లు
● 5 రోజుల వయసులో పిల్ల పురుగులు
● గ్రాములో 3 వేల పిల్ల పురుగులు
● కూరగాయ వ్యర్థాలు, చద్దన్నం, గోధుమ తవుడు మిశ్రమం
● ఆ మిశ్రమమే పురుగులకు ఆహారం
● 15–25 రోజుల్లో లార్వా సిద్ధం. ప్యూపా దశకు ముందే ఈ పురుగులను వాడుకోవాలి

పిజెటిఎస్ఎయులో పైలెట్ ప్రాజెక్టు

అయితే, మన దేశంలో దీనిపై పరిశోధనలు ఇంకా శైశవ దశలోనే ఉన్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పిజెటిఎస్ఎయు) ఈ దిశగా ముందడుగు వేసింది. దేశంలోనే మొట్టమొదటిగా బిఎస్ఎఫ్ పెంపకంపై పరిశోధన చేపట్టింది. నేషనల్ అగ్రికల్చర్ హయ్యర్ ఎడ్యుకేషన్ 'వేస్ట్2వెల్త్' ప్రాజెక్టును మంజూరు పిజెటిఎస్ఎయుకు గత ఏడాది చేసింది. పిజెటిఎస్ఎయు పీజీ స్టడీస్ డీన్, కీటక శాస్త్ర ఆచార్యులు డా. వి. అనిత ఈ ప్రాజెక్టుకు నోడల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆవరణలో బ్లాక్ సోల్జర్ ఫ్లైల పెంపకం కమ్ శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పారు. కూరగాయలు, పండ్ల వ్యర్థాలు, మెస్‌లో మిగిలిన అన్నం, గోధుమ తవుడు మిశ్రమంతో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులు పెంచుతున్నారు. పరిశోధక విద్యార్థులు పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

ఈ నేపథ్యంలో, కృషి విజ్ఞాన కేంద్రాల్లోని శాస్త్రవేత్తల మొదటి బ్యాచ్‌కు డా. అనిత ఇటీవలే శిక్షణ ఇచ్చారు. ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు డా. అనిత 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. నగరాలు, పట్టణాల్లో వెలువడే సేంద్రియ ఆహార వ్యర్థాల కాలుష్యాన్ని తగ్గించడానికి, పనిలో పనిగా మంచి ప్రొటీన్‌ను అందుబాటులోకి తెచ్చుకోవడానికి బిఎస్ఎఫ్ లార్వాల పెంపకం ఉపయోగకరం. అన్నిటికీ మించి, సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లోనే 70–80% మేరకు తగ్గించేంత ఆబగా తినగల శక్తి బిఎస్ఎఫ్ జాతికి వుంది. బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి మన దేశపు వాతావరణం చాలా అనువైనదంటున్నారు డా.అనిత.

పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్



● బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను వర్టికల్ టవర్‌లో ట్రేలలో పెంచవచ్చని చెబుతున్న డా. వి. అనిత

ఎంటర్‌ప్రెన్యూర్లకు, రైతులకు శిక్షణ ఇస్తున్నాం

బ్లాక్ సోల్జర్ ఈగలు మనకు కొత్తవి కావు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 20వ శతాబ్దం నుంచి ఉన్నదే ఈ జాతి. కొత్త తెగుళ్లు వ్యాప్తి చెందుతాయన్న భయం లేదు. ఆహార వ్యర్థాలు, పశువుల విసర్జితాలను సాధ్యమైనంత మెత్తగా చేసి, సులభంగా జీర్ణించుకునేలా మార్చి ఈ పురుగులకు వేయాలి. అందులో ప్రొటీన్లు ఉండాలి. చిన్న పిల్లల ఆహారం లాగా ఉండాలి. కూరగాయలు, పండ్ల వ్యర్థాలను సేకరించి, మెత్తగా రుబ్బి.. దానితో పాటు మెస్‌లో మిగిలిపోయిన అన్నం, గోధుమ తవుడు కొంచెం కలిపి మా ప్రయోగశాలలో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను పెంచుతున్నాం. వాటికి వేసే ఆహారాన్ని బట్టి, దానిలో పోషక విలువలను బట్టి, వాతావరణంలో వేడి, గాలిలో తేమను బట్టి.. అవి ఎన్ని రోజుల్లో, ఎంత బరువు పెరుగుతాయన్న విషయం ఆధారపడి ఉంటుంది. సేంద్రియ వ్యర్థాలను సమర్థవంతంగా నాణ్యమైన సేంద్రియ ఎరువుగా మార్చుకునే మార్గం ఇది. పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. మంచి ఆదాయమూ సమకూరుతుంది. రైతులకు, ఎంటర్‌ప్రెన్యూర్లకు శిక్షణ ఇస్తున్నాం.

– డా. వి. అనిత, కీటక శాస్త్ర ఆచార్యులు, పీజీ స్టడీస్ డీన్, బ్లాక్ సోల్జర్ ఫ్లై ప్రాజెక్టు నోడల్ ఆఫీసర్, పిజెటిఎస్ఎయు, హైదరాబాద్. మొబైల్: 94402 58050

బిఎస్ఎఫ్ ప్రత్యేకతలు

సేంద్రియ వ్యర్థాలను తినే అనేక జీవులుండగా బ్లాక్ సోల్జర్ ఫ్లైలనే ఎందుకు ఎంపిక చేసినట్లు? ఇదే ప్రశ్న డా. అనితను అడిగితే ఇలా బదులిచ్చారు...

- రోజుకు తన బరువుకు రెట్టింపు సేంద్రియ వ్యర్థాలను తిని, సేంద్రియ ఎరువును విసర్జించగల శక్తి బిఎస్ఎఫ్ పిల్ల పురుగులకు ఉంది. దీని అర్థం ఏమిటంటే.. చెత్త కుప్పలకు తరలివెళ్లే సేంద్రియ వ్యర్థాలు తగ్గిపోతాయి. మిథేన్ ఉద్గారాలు ఆ మేరకు తగ్గుతాయి.
- కుళ్లిన పండ్లు/కూరగాయలు,హోటళ్లు/ఇళ్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలు వంటి సేంద్రియ వ్యర్థాలను బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి వాడొచ్చు.
- బిఎస్ఎఫ్ జీవిత చక్రం మొత్తం 42–55 రోజులు. గుడ్లు పెట్టిన 4–5 రోజులకు పిగులుతాయి. అవి 15–25 రోజుల్లో పిల్ల పురుగులా(లార్వా)గా ఎదుగుతాయి. ఈ దశలోనే వాటిని సేకరించి కోళ్లు, ఆక్వా మేతల్లో వాడుతున్నారు. అలాగే ఉంచితే, ప్యూపాగా రూపాంతరం చెంది, 17 రోజుల తర్వాత బ్లాక్ సోల్జర్ ఈగలు పుడతాయి. మగ ఈగ 4 రోజుల్లో ఆడ ఈగను కలిసిన తర్వాత చనిపోతుంది. ఆడ ఈగ 5–8 రోజుల్లో గుడ్లు పెట్టి చనిపోతుంది.
- గుడ్లను సేకరించి, అతి చిన్న పురుగులను తయారు చేయటం కొంచెం క్లిష్టమైన ప్రక్రియ. 5 రోజుల పిల్లలకు తగిన సేంద్రియ ఆహారం అందిస్తే 15–25 రోజుల్లో పిల్ల పురుగులు(లార్వా)గా పెరుగుతాయి. ఆ దశలో చక్కని ప్రొటీన్లతో కూడిన ఆ పిల్ల పురుగులు కోళ్లు, చేపలు, రొయ్యలకు మేతగా వాడుకోవచ్చు.
- 5 రోజుల పిల్లలను కొనుక్కొని రైతులు 15–25 రోజుల్లో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను లార్వా దశకు పెంచి, కోళ్లకు, చేపలు, రొయ్యలకు మేతగా వేసుకోవచ్చు లేదా కొనుగోలుదారులకు అమ్ముకోవచ్చు. స్వయం ఉపాధిగా యువకులు బిఎస్ఎఫ్ లార్వా సాగు చేపట్టవచ్చు. ఈ లార్వాను దాణా తయారీ కంపెనీలు, సంస్థలు కొనుగోలు చేస్తున్నాయి. లార్వా దశ దాటి ప్యూపా దశకు పెరిగితే దాణాల్లో వాడకానికి పనికిరాదు.
- సోయా చిక్కుళ్ల సాగులో సమస్యలు, సముద్రాల్లో చేపల సంతతి తగ్గిపోతుండటం వల్ల కోళ్లు, ఆక్వా మేతలతో పాటు, పెంపకపు కుక్కల మేతల్లో కూడా బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను ప్రొటీన్ సప్లిమెంట్‌గా ప్రపంచవ్యాప్తంగా వాడుతున్నారు. దీంతో బిఎస్ఎఫ్ లార్వా సాగుకు డిమాండ్ పెరుగుతోంది.
- ఈ పిల్ల పురుగులే అధిక నాణ్యత గల ప్రొటీన్లతో కూడిన దాణాకు ముడి పదార్థం. కోళ్లు, చేపలు, రొయ్యలు, పందులు, పెంపుడు కుక్కలకు వేసే మేతలో బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పొడిని కలపవచ్చు. పిల్ల పురుగుల బరువులో 40–45% ప్రొటీన్‌తో పాటు ఎసెన్షియల్ అమినో యాసిడ్లు ఉంటాయి. సాధారణంగా మేతల్లో ప్రొటీన్లుగా వాడే సోయా చిక్కుడు గింజలు, ఫిష్‌మీల్‌ను కొంత తగ్గించి దీన్ని వాడుతున్నారు.
- కోళ్లకు రోజువారీ మేతలో పది శాతం మేరకు దీన్ని వాడుతున్నారు. పిల్ల పురుగులను బతికి ఉన్నప్పుడే ఫారం కోళ్లకు మేపవచ్చు. నాటు కోళ్లకూ ఇది మంచి ఆహారం.
- బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకం క్రమంలో వెలువడే విసర్జితాలే(ఫ్రాస్) పంటలకు అత్యంత విలువైన సేంద్రియ ఎరువుగా పనికి వస్తుంది. వర్మీకంపోస్టు, పశువుల ఎరువుల్లో కంటే అధిక పోషక విలువలు ఇందులో ఉంటాయని చెబుతున్నారు.
- విదేశాల్లో బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పొడిని బర్గర్లు, షేక్‌లలో కలుపుతున్నారు. దీని నుంచి వెలికితీసే నూనెను బయో ఇంధనంగా వాహనాలు, జనరేటర్లలో వాడుతున్నారు. బిఎస్ఎఫ్ లార్వా నుంచి వెలువడే పొలుసులు(కూటిన్) బయోడీగ్రేడబుల్ ప్యాకేజింగ్ ప్లాస్టిక్ తయారీకి వాడుతున్నారు. యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలున్నందున వైద్య అవసరాలకు కూడా వినియోగిస్తున్నారు.
- వర్షాకాలంలో దీపం చుట్టూ చేరే ఉసుళ్లను వేపుకొని శనగపప్పుతో కలుపుకొని తినే అలవాటు మన దేశంలోనూ ఉంది. బిఎస్ఎఫ్‌తో పాటు మిడతలు, మీల్ వార్మ్స్, గొల్లభామలు, వంటి 1,900 జాతుల పురుగులను 113 దేశాల్లో 200 కోట్ల మంది తింటున్నారని ఎఫ్ఎఓ చెబుతోంది.